"బాగున్నావా అన్నయ్యా!" అంటూ నేను ఇంట్లోకి వెళ్లగానే ఒక్కసారి అక్కడ నిశ్శబ్దం అలుముకుంది.

"అదేంటి నేను రాగానే అందరూ ఆశ్చర్యపోతారనుకుంటే షాక్ అయినట్లు కనబడుతున్నారు" వాతావరణాన్ని మామూలు స్థితికి తీసుకురావడానికి ప్రయత్నిస్తూ అన్నాను.

"ఏంలేదురా... బాగున్నావా? అమ్మా నాన్నా అందరూ బాగున్నారా?" అడిగాడు అన్నయ్య.

"మా సంగతికేంగానీ నువ్వెలాగున్నావ్ సుధాకర్? నీ జాబ్ ఎలా ఉంది?" అడిగింది వదిన.

"అంతా ఓకే... అది సరే మన బుజ్జిగాడేదీ కనబడడంలేదు" అన్నాను అన్నయ్య కొడుకు ప్రణీత్ కోసం వెదుకుతూ.

"ఇంకా వాడిని బుజ్జిగాడు అన్నావంటే అరచి గోల చేస్తాడు. ఇంటర్ చదువుతున్నాడుకదా... ప్రణీత్ అనే పిలవాలిట" అంది వదిన నవ్వుతూ.

"అదొక్కటే తక్కువ వెధవకి. ఆ రోషాన్ని చదువులో చూపించమను" అని ఇంకేదో అనబోతున్న అన్నయ్యకి అడ్డు తగులుతూ-

"మీరింక ఆపండి. ఎప్పుడూ వాడిని ఏదో ఒకటి ఆడిపోసుకుంటూనే వుంటారు"




"ఇదయ్యా పరిస్థితి... తండ్రి కొడుకులిద్దరికీ ఒక్క క్షణం పడడంలేదు."

"ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చదువుతాడు" అన్నయ్య హుంకరింపు.

"ఇప్పుడు సమస్య ఏంటి?" అన్నాను విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ.

"వీడి క్లాసులో అందరికీ తొంభైకి పైగా మార్కులు వస్తుంటే వీడింకా ఎనభైల్లోనే ఉన్నాడు" అసహనంగా అన్నాడు అన్నయ్య.

అన్నయ్య, వదినలతో మాట్లాడిన తరువాత పూర్తిగా బోధపడిన విషయం ఏమిటంటే బుజ్జిగాడు ఎంత బాగా చదివినా అన్నయ్యని మెప్పించలేకపోతున్నాట్ట. అన్నయ్య అనే మాటలకి వాడు మరింత మొండిగా తయారవుతున్నాడట. అన్నయ్య వాదన ప్రకారం ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే వాడింకా కష్టపడాలి. బుజ్జిగాడితో కూడా సరదాగా మాట్లాడాక తేలిన విషయం ఏమిటంటే వాడు బాగానే చదువుతున్నాడు. కానీ ప్రతిసారీ వాడి విజయాలను అన్నయ్య తక్కువగా చూస్తుండడంతో వాడిలో ఒకరకమైన నిర్లక్ష్య ధోరణి పెరుగుతున్నట్లు కనబడింది.

అన్నయ్య కుటుంబంతో నా అనుబంధం చాలా గట్టిది. నాకూ అన్నయ్యకూ పదేళ్లకుపైగా తేడా ఉండడం, నా చిన్నతనంలోనే అన్నయ్య పెళ్లవడం, కొంత నా విద్యాభ్యాసం వీళ్లింట్లోనే జరగడం, నాముందే బుజ్జిగాడు పుట్టడం, పెరగడం... ఇలా అనేక విషయాలవలన ఎలాగైనా ఆ కుటుంబంలో ఆనందం నింపాలనుకున్నాను. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి వదినతో చర్చించాను. ముందు సంకోచించినా చివరికి మంచే జరుగుతుందన్న నమ్మకంతో వదిన గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే చేయాల్సిన పనులన్నీ చేసేసాను.

***

ఆ రోజు బుజ్జిగాడి ఎమ్‌సెట్ ఫలితాలు వచ్చేరోజు. ఎంతో ఆత్రుతతో పేపర్ తెచ్చిన అన్నయ్య తన డైరీలో రాసుకున్న బుజ్జిగాడి హాల్‌టిక్కెట్ కోసం పేపర్‌లో వెదికి దాని ఫలితం కనబడగానే అగ్గిమీద గుగ్గిలమయ్యాడు.

"మీరంతా ఇలా వాడిని వెనకేసుకుని రావడంవల్లనే పన్నెండువేల ర్యాంకు వచ్చింది. ఇక వాడి జీవితం ఏంగాను" అంటూ అరుపులు, కేకలతో తెగ బాధపడిపోయాడు. దానికితోడు చుట్టాలు, స్నేహితుల ఫోన్లు, వాళ్ల వాళ్ల పిల్లల విజయగాథలు కలసి అన్నయ్య కోపాన్ని మరింత పెంచాయి.

"నీ కోపం వీడికి సరైన ర్యాంకు రాలేదనా? లేక నలుగురిలో నీకు అవమానంగా ఉందనా? అసలు నువ్వు ఎంత ర్యాంకు ఎక్స్‌పెక్ట్ చేసావు? దానికి వాడికి ఎన్ని మార్కులు రావాలి? వాడు వాడి కోచింగ్ సెంటర్ పెట్టే పరీక్షల్లో ఎన్నెన్ని మార్కులు సంపాదిస్తున్నాడు? ఇలాంటి విషయాలు ఏమైనా నీకు తెలుసా?" అంటూ ఎదురు దాడికి దిగాను. నిజానికి అన్నయ్య పెద్ద ర్యాంకు స్టూడెంట్ ఏమీకాదు. కానీ ఆ రోజుల్లో అది సరిపోయింది. అందుకే తన కొడుకైనా ప్రయోజకుడు కావాలనేది అన్నయ్య ఆశ. అయితే ఆయన అవలంబించిన విధానమే ఆయనకి, బుజ్జిగాడికి దూరాన్ని పెంచడమేకాక ఒకరకంగా బుజ్జిగాడు రాంగ్ రూట్లోకి వెళ్లే అవకాశాన్ని కలిగించింది.

నా ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానం చెప్పలేకపోయినా కనీసం ఐదారు వేల ర్యాంకు లోపలన్నా రావాలనేది ఆయన ఆలోచనగా అర్థమయింది

"ఇంక మీ అన్నయ్యని టెన్షన్ పెట్టకుండా అసలు సంగతి చెప్పు సుధాకర్?" అంది వదిన.

"నన్ను క్షమించు అన్నయ్యా. నీలో మార్పు తేవాలనే నిన్ను అడగకుండా చిన్న తప్పు చేసాను. మన వాడికొచ్చింది పన్నెండువేల ర్యాంకుకాదు. పదహారువందల ర్యాంకు. అయితే నీకు కాస్త విషయాన్ని విపులంగా చెప్పాలనే ఉద్దేశ్యంతో నువ్వు డైరీలో రాసుకున్న హాల్‌టిక్కెట్‌లో చివర వున్న ఒకటి అంకెను ఏడుగా దిద్దాను." అంటూ హాల్ టిక్కెట్‌ని, పేపర్‌ను అన్నయ్యకిచ్చాను.

అన్నయ్య మరోసారి పేపర్‌లో సరిచూసి ఆనందంగా నా చేయి పట్టుకుని "నేను నిన్ను క్షమించడం కాదురా, మీరందరూ నన్ను క్షమించాలి. వాడిని ఇంకా అభివృద్ధిలోకి తేవాలనుకున్నానుగానీ నా మాటలు వాడిపై వ్యతిరేకంగా పని చేస్తాయని గ్రహించలేకపోయాను" అన్నాడు.

నిజానికి పోయినసారి నేను అన్నయ్య వాళ్లింటికి వచ్చినప్పుడు ఈ సమస్య వినగానే నేను మొదట చేసిందల్లా బుజ్జిగాడికి చిన్న కౌన్సిలింగ్. అన్నయ్య మనస్తత్వం నాకు తెలుసు కనుకనే వాడిని అన్నయ్య మాటలు పట్టించుకోవద్దని, రేపు నువ్వు ఊహించలేని విజయాలు సాధించినప్పుడు అన్నయ్యకన్నా ఆనందించేవాడు ఉండడని, దానికి నేను చేయాల్సింది నేను చేస్తాను, నువ్వు మిగిలిన విషయాలు ఏమీ పట్టించుకోవద్దని చెప్పాను. అన్నయ్యకి నిజానికి ఎంత సాధించగలం, ఎంత సాధించాలి అన్న విషయాలపై పెద్దగా అవగాహన లేకున్నా ప్రతిసారీ సాధించిన దానికన్నా మరింత ఎక్కువ సాధించాలి అని అనుకోవడమే అసలు సమస్య. బుజ్జిగాడు ఇంటికి వచ్చి మారిన తండ్రిని చూసి ఆశ్చర్యపోయాడు. అయితే వాడి వెనకాల ఇంట్లో ఏం జరిగిందనే సంగతి మాత్రం వాడికి ఎప్పటికీ తెలియదు.

★